# ఊపందుకున్న యాసంగి సాగు



సాగు చేసిన శనగ పంట

ముథోల్, డిసెంబర్ 9 : యాసంగి సాగు పనులు ఊపందుకున్నాయి. వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. అధిక శాతం రైతులు శనగ పంటను వేస్తున్నారు. ప్రధాన పంటలుగా శనగ, మక్క, పొద్దు తిరుగుడు, కుసుమలు, జొన్నలు, ఎర్రజొన్న పంటలను సాగు చేస్తారు. పల్లెల్లో వ్యవసాయ క్షేత్రాలు పచ్చగా దర్శనమిస్తున్నాయి.

**పెరిగిన విస్తీర్ణం**

ముథోల్ మండలంలో సాగునీటి వసతి ఉన్న ప్రాంతాల్లో యాసంగి సాగు ఊపందుకున్నాయి. గతంతో పోలిస్తే బోరుబావులు రైతులు ఎక్కువగా వేసి పంటలను సాగు చేస్తున్నారు. నీటి ఎద్దడి లేకుండా పోయింది. బావుల, బోర్ల ద్వారా వంద ల ఎకరాలకు నీరందిస్తున్నారు. ముథోల్, తరోడా, ఎడ్‌బిడ్, ఆష్టా, బోరిగాం, మచ్కల్‌తో పాటు తదితర గ్రామాల్లో వేల ఎకరాల్లో శనగను సాగు చేస్తున్నారు.

**వేల ఎకరాల్లో పంటల సాగు**

మండలంలో ఈ సారి యాసంగిలో మొత్తం దాదాపు 14 వేల ఎకరాలు సాగులో ఉన్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. ఇప్పటి వరకు ఈ విధమైన పంటలు వేసినట్లు వారు తెలిపారు. ఇందులో 8 వేల ఎకరాల శనగ, 5200 ఎకరాల మక్క, 123 ఎకరాల పొద్దు తిరుగుడు, కుసుమ 100 ఎకరాలు, జొన్నలు 250 ఎకరాలు, ఎర్ర జొన్న 160 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

**ఆశాజనకంగా పంటల సాగు..**



ముథోల్ మండలంలో సాగు చేస్తున్న యాసంగి పంటలు ప్రస్తుతం ఆశాజన కంగా ఉన్నాయి. శనగ పంటలో పురుగు ఉధృతి ఎక్కువగా ఉండ డంతో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. తగిన సలహాలు రైతులకు అందిస్తున్నాం. ప్రధానంగా ఏఈవోలు వారికి అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు అందజేశారు.

- ఏవో భాస్కర్



మక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో భాస్కర్



సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన

# అల్ఫోర్స్‌లో సీపీఆర్‌పై అవగాహన

భైంసా, డిసెంబర్ 9 : భైంసాలోని అల్ఫోర్స్ పాఠశాలలో శనివారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గుండెపోటు రావడానికి గల కారణాలను ఆహారం ఎలా ప్రభావితం చేస్తుందో వివరించారు. సీపీఆర్ ఎలా చేయాలో అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితిలో ప్రాణాలను కాపాడేందుకు ప్రతి విద్యార్థి సీపీఆర్ దోహదపడుతుందని పేర్కొన్నారు. ఇందులో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

# చలి చలి

**కుంటాల, డిసెంబర్ 9 : మండలంలో చలి తీవ్రమైంది. వేకువ జామున పొగ మంచుతో రోడ్డును కప్పి ఉంటున్నది. సాయంత్రం నుంచి ఉదయం వరకు మంచు కురుస్తున్నది.**



కుంటాలలో పొగమంచు కప్పి ఉండగా వాకింగ్ చేస్తున్న యువకులు

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



లస్మయ్య(ఫైల్)

నర్సాపూర్(జీ), డిసెంబర్ 9 : మండలంలోని గొల్లమాడ గ్రామంలో శనివారం కరెంటు తీగలు తగిలి ఓ మృతి చెందిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అడవి జంతువుల నుంచి తన పంటను కాపాడుకునేందుకు కాపెల్లి పెద్ద లస్మయ్య తన చేను చుట్టూ ఇనుప తీగలు అమర్చి కరెంటు కనెక్షన్ పెట్టించాడు. ఈ క్రమంలో చేనుకు వెళ్లి పంటను పరిశీలిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు తీగలకు కాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి చిన్న కుమారుడు తోటకు వెళ్లి చూడగా తండ్రి అప్పటికే మృతి చెంది ఉన్నాడు. ఈ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మాన్ సింగ్ తెలిపారు.

## కూతురి సైన్స్ ప్రదర్శన చూసి సంబురపడ్డ కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 9: విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించడంతో పాటు ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తూ భావిశాస్త్రవేత్తలుగా ఎదిగేలా కృషి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం లిటిల్ స్టార్ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించగా కలెక్టర్ హాజరై ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనను ప్రారంభించారు. తన కూతురు కూడా ప్రదర్శించగా వాటిని అడిగి తెలుసుకుంటూ సంబురపడ్డారు.



కూతురు సైన్స్ ప్రదర్శన చూస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

## ఎమ్మెల్యే కోవలక్ష్మిని కలిసిన నాయకులు



ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నార్నూర్, డిసెంబర్ 9 : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మిని కార్యాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అనురాగ్, శేఖర్, విజయ్‌కుమార్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# బోథ్‌లోని గురుకులంలో సందడి

బోథ్, డిసెంబర్ 9 : బోథ్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సందడి నెలకొంది. రెండో శనివారం కావడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచి తల్లిదండ్రులు తమ పిల్లలను కలవడానికి తరలివచ్చారు. దినమంతా వారితో కలిసి ఉన్నారు. బాగోగులు అడిగి తెలుసుకున్నారు. చదువు పరిణితి తీరును పరీక్షించారు. ఇంటి నుంచి తీసుకు వచ్చిన ఆహార పదార్థాలతో చెట్ల కింద వన భోజనాలు చేశారు. ఆదిలాబాద్, నిర్మల్, ఖానాపూర్, భైంసా, ముథోల్, లక్సెట్టిపేట, బెల్లంపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఉట్నూర్ ప్రాంతాల నుంచి పోషకులు తరలివచ్చారు. ప్రిన్సిపాల్ స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్ ఆధ్వర్యంలో పోషకులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.



బోథ్‌లోని గురుకులంలో పిల్లలతో తల్లిదండ్రులు

# యువత క్రీడల్లో రాణించాలి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 9: యువత క్రీడల్లో రాణించాలని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ అన్నారు. శనివారం మండలంలోని సాకెరా(బీ) గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువత చదువుతో పాటు క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే విధంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## జాతీయ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

ఎదులాపురం, డిసెంబర్ 9 : ఎంఐఎం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీని ఆదిలాబాద్ జిల్లా నాయకులు శనివారం హైదరాబాద్‌లోని దారుస్సలాంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంఐఎం పార్టీ నుంచి ఏడుగురు ఎమ్మెల్యేలు గెలిచిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో ఎంఐఎం పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీ షకీల్, అహ్మద్, నాయకులు అహ్మద్ ఖాన్, సిరాజ్ ఉన్నారు.



అసదుద్దీన్ ఓవైసీకి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు